## వైవీయూ విసి, రిజిస్ట్రార్ రాజీనామా

**ప్రజాశక్తి - కడప అర్బన్**

యోగివేమన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య రాజీనామా చేశారు. ముందుగా రిజిస్ట్రార్ రాజీనామాను ఆమెదించి అనంతరం విసి ఆచార్య సుధాకర్ రాజీనామా చేశారు. ఈ సమాచారాన్ని ఉన్నత విద్యా మండలి కార్యదర్శికి పంపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. వివిధ విశ్వవిద్యాలయాలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన వైవీయూ ప్రొఫెసర్లు ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి, ఆచార్య రామచంద్రారెడ్డి శనివారం తన మాతృ సంస్థ అయిన వైవీయూలోకి వచ్చారు.

ప్రిన్సిపల్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న ఇసి సుధాకర్

# అతిసార నిర్మూలనకు శుభ్రతే కీలకం

### - జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

**ప్రజాశక్తి - రాయచోటి**

అతిసార నిర్మూలనకు పరిశుభ్రత, నాణ్యమైన నీటి సరఫరాలే కీలకమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అతిసార వ్యాధి నిర్మూలన ప్రచార కార్యక్రమం – 2024 పై జెసి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, విద్య, ఐసిడిఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అతిసార ఇప్పటికీ దేశంలో ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా ఉందని, శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టం ప్రకారం మన దేశంలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలలో 5.8 శాతం పిల్లలు అతిసార వల్ల చనిపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో అతిసార వ్యాధిని పూర్తిగా అరికట్టడానికి విద్య, వైద్య, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపాలిటీ, తదితర శాఖల సమన్వయం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో అతిసార వ్యాధి నిర్మూలనకు తీసుకోబోయే చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క శాఖ తీసుకోవాల్సిన చర్యల గురించి వివిధ సూచనలను చేశారు. అతిసార వ్యాధి ఏ విధంగా వ్యాపిస్తుందో ప్రజలందరికీ తెలియపరిచేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, చికిత్సకు అవసరమైన మాత్రలు, మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, విటమిన్ మాత్రలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రులకు ఈ వ్యాధి గురించి అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉపయోగించే నీరు సురక్షితమైనదిగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు . అతిసార వ్యాధి కార్యక్రమంపై పిల్లలందరికీ అవగాహన కల్పించి పిల్లలకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలన్నారు. అతిసారపై ఒక వీడియోను రూపొందించి పిల్లలందరికీ చూపించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో వాడే నీరు సురక్షితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని నీటి సరఫరా పైప్‌లైన్లలో ఎటువంటి కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలోని ప్రభుత్వ భవనాలలో నీటి నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఆర్‌ఒ ప్లాంట్లు, నీటి సరఫరా పైప్ లైన్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి శాఖలో ఒక అధికారిని నోడల్ అధికారిగా నియమించి కార్యక్రమంపై సమన్వయ పరచుకొని అతిసార నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం, జులై 1 నుంచి జూలై 31 వరకు జరగబోయే డెంగీ వ్యతిరేక మాతోత్సవంపై పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి పర్మాన్ అహ్మద్‌ఖాన్

# ప్రభుత్వ బడిని రక్షించుకుందాం : యుటిఎఫ్

**ప్రజాశక్తి-రాయచోటి**

ప్రభుత్వ బడని రక్షించుకుందామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్ పేర్కొన్నారు. శనివారం 'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' అనే కరపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం అలిమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నైతిక విలువలు, చదువు, సంస్కారం, దేశభక్తి, సమానత్వ భావనలు ఏర్పడేలా విద్యాబుద్ధులు నేర్పించబడతాయని, అటువంటి బడిని ఉపాధ్యాయులు కాపాడుకొని సమాజాభివృద్ధికి అంకితం కావాలని పిలుపునిచ్చారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం, ప్రభుత్వ బడిలోని సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. వారి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి ఊరి బడిని ఉన్నతమైన స్థితికి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కామన్ స్కూల్‌లో ధనిక,పేద, కుల,మత భేదాలు లేని బడి ప్రభుత్వ బడి అని వారు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అందరూ బడిలో చదివే తల్లిదండ్రులందరికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా బడిని తీర్చిదిద్దడంలో నిమగ్నం కావాలని విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో చదవడం రాయడం మాట్లాడడం నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా పనిచేయాలన్నారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనే కాక ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణలోనూ, సామాజిక సేవా దృక్పథం లోను, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి సి.రాజా రమేష్, చాన్ బాషా, జయన్న, రహంతుల్లా, మహమ్మద్, ఇలియాస్, జగదీష్,రాజబాబు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# స్కౌట్ విద్యార్థులు రోల్ మోడల్‌గా ఎదగాలి

### - రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాంప్రసాద్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న స్కౌట్ విద్యార్థులు, నరసింహారెడ్డి

**ప్రజాశక్తి- రాయచోటి**

స్కౌట్ శిక్షణతో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మండిపల్లి భవన్‌లో శనివారం ఉదయం మర్యాదపూర్వకంగా తనను కలిసిన అన్నమయ్య జిల్లా స్కౌట్స్ సెక్రటరీ, గైడ్ కెప్టెన్లతో ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ఆధారంగా స్కౌట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం పెంపొందుతుందన్నారు. తల్లిదండ్రులు, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి స్కౌట్స్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విలువలు సమకూరతాయన్నారు. దీంతోపాటు విద్యార్థులలో మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందన్నారు. స్కౌట్ సర్టిఫికెట్ కలవారికి విద్యా ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, గైడ్ కెప్టెన్ హేమలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయడం అభినందనీయం

### - మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

సిఐటియు నాయకులను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

రక్తదానం గొప్ప విషయమని, రక్తహీనతతో బాధపడుతున్న వారికి, ప్రమాదాలకు గురైన వారికి ఆపద సమయంలో సిఐటియు రక్తదానం చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, వంద పడకల ప్రభుత్వాసుపత్రి డైరెక్టర్ సీనియర్ వైద్యులు మహేశ్వర్ రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఐటియు వ్యవస్థాపకులు పర్స సత్యనారాయణ శత జయంతి సందర్భంగా అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిషనర్, ఆస్పత్రి డైరెక్టర్ మహేశ్వరరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ రక్తం మరొకరికి జీవం పోస్తుందని సిఐటియుతోపాటు యువత రక్త దానం చేయడానికి నడుం బిగించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వాసుపత్రికి 20 యూనిట్ల రక్తం సిఐటియుగా ఇచ్చామని చెప్పారు. సిఐటియు పిలుపు మేరకు స్పందించి రక్తం ఇచ్చిన దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్‌లో విస్తృతంగా రక్తదాన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. జబీర్, రాజారమేష్, కెవిపిఎస్ కో–కన్వీనర్ వెంకటయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షులు కె. నాగబసిరెడ్డి, విద్యుత్ రంగం నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, మున్సిపల్ నాయకులు చెన్నయ్య, అశోక్, బి.వి. రమణ, హమాలీ సంఘం నాయకులు మాధవయ్య గ్రీన్ అంబాసిడర్ జిల్లా అధ్యక్షుడు శేఖర్ నాయక్ పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మదనపల్లి**

పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం చైర్‌పర్సన్ మనూజ కిరణ్ అధ్యక్షతన జరిగిన పురపాలక సంఘ సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కౌన్సిల్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రమాణం చేశారు. అంతకుముందు పట్టణంలోని టిడిపి, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని స్కూటర్ ర్యాలీ నిర్వహించి పురపాలక సంఘ కార్యాలయం ఆవరణ ముందు ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. పురపాలక సంఘం పూర్తిగా పసుపు మయంగా మార్చేశారు. పసుపు రంగు బెలూన్లతో అలంకరించారు భారీ జనము మధ్య మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లోకి ఎమ్మెల్యేరాగా మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, చైర్‌పర్సన్, కమిషనర్ ప్రమీల, పురపాలక సంఘ సిబ్బంది ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాష మాట్లాడుతూ పార్టీలకు, కులమతాలకతీతంగా మదనపల్లి పట్టణాభివృద్ధి ద్యేయంగా పనిచేస్తానని అందుకు పురపాలక కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది గురించి పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ నిధులు సైతం ఏమాత్రం పట్టణ అభివృద్ధిపై వెచ్చించలేదన్నారు. ఇకపై అలాంటివి జరగనివ్వనని మున్సిపల్ అభివృద్ధికి కావాల్సిన నిధులను పూర్తిస్థాయిలో అందించి పట్టణాభివృద్ధి ధ్యేయంగా పని చేస్తానని పేర్కొన్నారు. అనంతరం వైస్‌చైర్మన్‌లు జింక వెంకటాచలపతి, నూర్ ఆజాం మాట్లాడుతూ పట్టణంలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రత పాటించే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. మురుగునీటి కాలువలలో పేర్కొన్న మట్టి మురుగును ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్, కమిషనర్లను కోరారు. కౌన్సిలర్లు సుధాకర్, రాజేష్, కరిముల్లా, గిరిజా సాయి శేఖర్ రెడ్డి, ఆర్కే తులసి, పాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, కుక్కల బెడద, బోర్ల మరమ్మతులు, నీటి సరఫరా పై సిబ్బంది సకాలంలో స్పందించాలని కోరారు. అనంతరం కౌన్సిల్ అజెండాలోని 70 అంశాలను ఏకగ్రీవంగా సభ్యులందరూ ఆమోదాన్ని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిర్మాణంలో ఉన్న కాలనీని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఉపేంద్ర బృందం

## పౌరులు హక్కులను పొందాలి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి-పీలేరు**

సమాజంలో పౌరులందరూ తమ హక్కులను పొందాలని ఎంపిడిఒ ఉపేంద్ర అన్నారు. శనివారం మండలంలోని ఆగ్రహారం పంచాయతీ, ఆరెంవారిపల్లి ఎస్టీ కాలనీలో ఎంపిడిఒ అధ్యక్షతన శనివారం పౌరహక్కుల దినోత్సవం సివిల్ రైట్స్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో–కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ కాలనీవాసులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టి పూర్తి కావస్తున్నా ఇంతవరకు బిల్లులు మంజూరు కాలేదని, సంబంధిత అధికారులు స్పందించి కాలనీవాసులకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా ఈ కాలనీలో రెండు వీధులకు విద్యుత్తులైను లేక స్థానికులు చీకట్లో జీవనం సాగిస్తున్నారని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కరెంట్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీవాసులు ఎవరైనా మరణిస్తే చెరువు గడ్డన ఖననం చేసుకునే పరిస్థితులు ఉన్నాయని, స్మశాన వాటికకు స్థలం చూపాలని సంబంధిత అధికారులను కోరారు. మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్ మాట్లాడుతూ నీటి సమస్య ఉన్నందున కాలనీ సమీపంలో ఉన్న బోర్‌ను రిపేరు చేయించి కాలనీలోకి పైప్ లైన్ ఏర్పాటు చేసి సింటెక్స్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ పంచాయతీలో ఓ ఎస్టీ కాలనీ ఉందన్న అని ఎవరు గుర్తించడం లేదని, ఎవర కాలనీకి చెంచులక్ష్మి కాలనీ గా నామకరణం చేయాలని, ఇండ్లు లేని వారికి ఇండ్ల కాలం మారుతున్న ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు లేకపోవడం బాధాకర విషయమని చింతించి మంగళవారం తహసిల్దార్ గారితో చర్చించి సంబంధిత అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి కాలనీ వాసుల సమస్యలను పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ–2 రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీరాములు నాయక్, ఇంచార్జ్ హౌసింగ్ ఎఇ బాలాజీ నాయక్ వెలుగు ఎపిఎం లక్ష్మణరెడ్డి, విఆర్‌ఒ కౌశిక్ అధికార యంత్రాంగం, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి కృష్ణయ్య, ఎర్రబెల్లి మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ నాయకులు గండికోట వెంకటేష్, మాల మహానాడు నాయకులు గట్టప్ప, దంపెట్ల ఆనంద, జాస్ నాయకులు రెడ్డయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల కబ్జాను అరికట్టండి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మండలంలోని బికె.పల్లి రెవెన్యూ పంచాయతీలో రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ శనివారం సిపిఐ నాయకులు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ మదనపల్లె మండలం బికె.పల్లి రెవెన్యూ పంచాయతీ, కోళ్లబైలు కాలనీలో 10వ లెటర్‌లో 20.47 ఎకరాల ప్రభుత్వ గయాల భూమి ఉందని, కోట్ల రూపాయల విలువచేసే ఈ ప్రభుత్వ భూమి పూర్తిగా కబ్జాకు గురైందన్నారు. 10వ లెటర్లో 20.47 ఎకరాల భూమిని 515, 516, 517 సర్వే నెంబర్లను సబ్ డివిజన్ చేశారని, 516, 517 సర్వేనెంబర్‌లో 2.15 సెంట్లు వంక పరంబోకు స్థలాన్ని కొంతమంది భూకబ్జా దారులు ఆక్రమించుకుని రెండు నెలలు క్రితం పునాదులు నిర్మించుకున్నారన్నారు. ఆ పునాదులకు నకిలీ పత్రాలు సృష్టించి అమాయకులకు లక్షల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకోవడంతో పాటు పలువురిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇంత పెద్ద ఎత్తున కళ్లముందే ప్రభుత్వ భూములు కబ్జాలు జరుగుతున్న సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి సుంకర శ్రీదేవి

## లోక్ అదాలత్‌లో 64 కేసులు పరిష్కారం

**ప్రజాశక్తి-పీలేరు**

పీలేరులో నిర్వహించిన జాతీయ లోక్ అదానత్ లో 64 కేసులు పరిష్కరించినట్లు పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి తెలిపారు. హైకోర్టు, చిత్తూరు జిల్లా కోర్టుల ఆదేశాల మేరకు శనివారం స్థానిక కోర్టులో 64 కేసులు పరిష్కారమయ్యాయని అన్నారు. మొదటి బెంచ్‌లో 8వ అదనపు జిల్లా జడ్జి 6 కేసులు, రెండవ బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.రవి 12 కేసులు, మూడవ బెంచ్ లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్.గాయత్రి 46 కేసులు పరిష్కరించారని తెలియజేశారు. వీటి ద్వారా రూ.1,70,22,898లు సెటిల్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెంజ్ సభ్యులుగా పి.జయశేఖర్, వి.చిన్న రెడ్డప్ప, టి.నిరంజన్ బెంచ్ వ్యవహరించారు. బార్ అధ్యక్షులు బీసీ పురుషోత్తంరెడ్డి, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, పోలీస్ అధికారులు, బ్యాంక్ అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్, తదితరులు పాల్గొన్నారు.

## హోం మంత్రిని కలిసిన 'చమర్తి'

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు హోం మంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహుమతిగా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజంపేట నియోజకవర్గంలోని పలు రకాల చట్టపరమైన సమస్యలు హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు చమర్తి తెలియజేశారు.

# ప్రశ్నార్థకం!

**ప్రజా'దృష్టి'**

జిల్లా జ్వరాల బారిన పడింది. జిల్లాలో మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా రోజురోజుకూ జ్వరతీవ్రత పెచ్చరిల్లుతోంది. పిల్లలు, పెద్దలు, వృద్ధులనే తేడా లేకుండా శారీరక, మానసిక, ఆర్థిక అనారోగ్యం బారినపడి విలవిల్లాడుతున్నారు. ఫలితంగా సమాజ ఆర్థిక జీవనాడులు స్తంభించిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల మండలానికి చెందిన ఓ మెడికో విద్యార్థిని డెంగీ జ్వరం బారిన పడి మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఆమె బెంగళూరులో డెంగీ బారిన పడినప్పటికీ, బెంగళూరు, కడప జిల్లాలో జ్వరాల విజృంభణకు తేడా లేదనే సంగతిని గ్రహించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జ్వరాల తీవ్రతను పరిశీలిస్తే 100 డెంగీ, 24 మలేరియా కేసులు నమోదు కావడం జ్వరాల తీవ్రతకు అద్దం పడుతోంది. రాబోయే రోజుల్లో వర్షాల తీవ్రత పెరగడం, తాగునీరు కలుషితం కావడానికి అవకాశం ఉంది. జ్వరాల తీవ్రత మరింత పెచ్చరిల్లే ప్రమాదం పొంచి ఉందని చెప్ప వచ్చు వేసవి సీజన్ నుంచి వర్షపు సీజన్‌లోకి మారడంతో వాతావరణంలో బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు జీవం సంతరించుకుని జ్వరాలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారింది. డిఎంహెచ్‌ఒ, సిహెచ్‌సి వైద్య కేంద్రాలు, పారిశుధ్యం, తాగునీటి కలుషితం నివారణకు దృష్టి సారించాల్సి ఉంది. సదరు వైద్య ఆరోగ్య, పారిశుధ్య, తాగునీటి సరఫరా విభాగాలు జ్వరాలకు సున్నిత కేంద్రాలు, అతిసున్నిత కేంద్రాలను గుర్తించి, జ్వరాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. దోమల గుడ్లు, లార్వాల వృద్ధి నిరోధక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి కట్టుదిట్టమైన చర్యల స్థానంలో మొక్కుబడి తనానికి అలవాటు పడితే దారినపోయే పెను ప్రమాదాన్ని ఇంట్లోకి ఆహ్వానించి నట్లు అవుతుందని గ్రహించాలి. ప్రజారోగ్య పరిరక్షణ పట్ల నెలకొన్న నిర్లక్ష్యాన్ని జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించాలి. పదేళ్ల కిందట ఉమ్మడి జిల్లా డెంగ్యూ బారిన పడిన సమయంలో పలువురు రోగులు తిరుపతి, కర్నూలు, చెన్నయ్, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలకు పరుగులు తీసిన సంగతి గుర్తుకువస్తోంది. ఫలితంగా లక్షలాది రూపాయలు కోల్పోవడం తెలిసిందే. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 72 పిహెచ్‌సి, 16 సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రి, జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో డెంగ్యూ ప్లేట్‌లెట్స్ ఎక్కించే సదుపాయ లేమి కారణంగా నగరాలకు పరుగులు తీయాల్సి వచ్చింది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ ఎక్కించే సదుపాయం ఉన్నప్పటికీ వైద్యుల్లో చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారింది. వీరికితోడు నర్సుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించని రోగులు సైతం ప్రయివేటు ఆస్పత్రులకు వేలాది రూపాయలు కొల్లబెడుతున్న దృశ్యం కనిపిస్తోంది. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ జిల్లా వాసి కావడంతో జ్వరాల తీవ్రతపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉరుముతోంది.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

# ప్రజా సంక్షేమం కోసం పనిచేద్దాం : 'నల్లారి'

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి

**ప్రజాశక్తి-పీలేరు**

మండల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చద్దామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో పనిచేశారని, అలాంటి పరిస్థితులు రాకుండా, లేకుండా చూద్దామని అన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నాయకులు తమ కుటుంబ సభ్యులను ఉద్యోగస్తులుగా పేర్ల చేర్చి, వారు పనిచేయకనే నెలనెలా వేతనాలు చెల్లించిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. కొత్తగా వచ్చిన ఇఒ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి తనకు నివేదిక ఇవ్వాలని చెప్పారు. పట్టణ పరిసరాల్లో ప్రభుత్వ భూముల అన్యాంతంపై ప్రతిపక్ష పార్టీ నాయకుడుగా తాను చేసిన ఫిర్యాదుపై స్పందించిన అప్పటి మదనపల్లి సబ్ కలెక్టర్ విచారణ చేపట్టి, ప్రభుత్వ భూముల కబ్జాపై నివేదిక సమర్పించారని, నిజాయితీగా నివేదిక అందించిన ఆ అధికారిణిని బదిలీ చేయించారని గుర్తు చేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది వాటిని పట్టించుకోకుండా ఆ భూములను కబ్జా చేసిన వైసిపి నాయకులకు అడ్డదారిలో పంచిపెట్టారన్నారు. పట్టణానికి 12 వేల ఇంటి స్థలాలు కేటాయించారని, వాటిలో ఆ పార్టీ అధికార పార్టీ నాయకులు తమ ఇష్టానుసారంగా అమ్ముకున్నట్లు చెప్పారు. స్థానికంగా సబ్ రిజిస్టర్ కార్యాలయంలోనూ దండిగా అవకతవకలు జరిగాయని, తమ ఇష్టానుసారంగా వేర్వేరు సర్వే నెంబర్లపై ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపించారు. మండలంలో ఎక్కడ తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల స్థాయి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**అధికారం ఉందని అహం చూపొద్దు**

అధికారం ఉందని అహం చూపి ప్రజల పట్ల దురుసుగా ప్రవరించడం తెలుగుదేశం పార్టీ శ్రేణుల సంస్కృతి, సాంప్రదాయాలు కాదని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత నివ్వడం టిడిపి లక్ష్యమన్నారు. దౌర్జన్యాలు, కక్ష సాధింపులు, కబ్జాలు, తప్పుడు కేసుల బనాయింపులు, వేధింపులు వాటి చర్యలకు ఎవరూ పాల్పడవద్దని, ప్రజాహితం మనకు ముఖ్యమని చెప్పారు. తన విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరిని గుర్తుంచుకుని వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ప్రజా ప్రతినిధులు ప్రజాగ్రహానికి గురై ప్రస్తుతం భద్రత కోరుతూ కోర్టులు ఆశ్రయించే పరిస్థితికి వచ్చారని, అలాంటి పరిస్థితి భవిష్యత్తులో మనకు రాకుండా ప్రజలతో మమేకమై వారి సంక్షేమం, అభివృద్ధి కోసం కష్టపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి శ్రేణులు కోటపల్లి బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అమర్నాథరెడ్డి, శివారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, వసంతాల రాజ, నారే సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలం

## ఆక్రమణకు గురికాకుండా హద్దులు వేయించాలి

**ప్రజాశక్తి-గాలివీడు**

స్థానిక గాలివీడు పంచాయతీ ఎగువపల్లి బండలో ఉన్న ప్రభుత్వం భూమి ఆక్రమణకు గురికాకుండా హద్దులు వేయించాలని గ్రామానికి చెందిన గొర్ల ముదివేటి మహేష్ శనివారం తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువపల్లి బండ సర్వే నెంబర్ 976లో 4ఎకరాల 70 సెంట్లు స్థలం ఉందని అన్నారు. అందులో సహకార పరపతి సంఘం, ఎంఆర్‌సి, సచివాలయం, రైతు భరోసా, అంగ న్వాడీ కేంద్రాల నిర్మాణాలకు ఎకరా స్థలం, నివాసాలకు మరో ఎకరా స్థలం పోనూ 2.70 ఎక రాలు ప్రభుత్వ భూమి ఉంటుందని అన్నారు. ఆ భూమి ఆక్రమణకు గురికాకుండా భూమిని సర్వే చేసి చుట్టూ హద్దులు వేయించాలని తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు.ఆ ప్రాంతంలోని ఖాళీ స్థలం రేకుల షెడ్లు, భవనాలు నిర్మించుకుంటూ అన్యాక్రాంతమైపోతుందని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి చుట్టూ కంచె వేయించి భూమిని పరిరక్షించాలని కోరారు.

## ఎన్నికల కోడ్ ముగిసినా.. పంపిణీకి నోచని డస్ట్‌బిన్‌లు

**ప్రజాశక్తి-గాలివీడు**

మండల కేంద్రం గాలివీడులో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి ఇంటింటి డస్ట్‌బిన్‌లు పంపిణీ చేసేలా అప్పటి వైసిపి ప్రభుత్వం సంకల్పించింది. ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికలకు ముందు వచ్చిన డస్ట్‌బిన్‌లు ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ చేయకుండా అలాగే నిల్వ ఉంచారు. ఎన్నికోడ్ ముగిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి నెలరోజులు కావస్తున్నా డస్ట్‌బిన్‌లు మాత్రం మూలకే పరిమితమయ్యాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు దృష్టిపెట్టి గ్రామ సచివాలయ సెక్రటరీలు, పంచాయతీ కార్యదర్శులతో వాటిని పంపిణీ చేయాలని పలువురు పేర్కొంటున్నారు. పంపిణీ చేయకుండా అలానే ఉంచి నిష్ప్రయోజనంగా మారు తాయని అన్నారు. వీటిపై అధికారులు దృష్టిపెట్టి సకాలంలో లబ్ధిదారులకు, గృహ నిర్వాహకులకు డస్ట్‌బిన్‌లు పంపిణీ చేపడితే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయాలి

**ప్రజాశక్తి-సుండుపల్లి**

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కె.వి రమణయ్య డిమాండ్ చేశారు. ఎపిలో ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గాల అభివృద్ధికి ఉద్దేశించిన ప్రత్యేక బడ్జెట్‌లో 22శాతం నిధులను తక్షణమే విడుదల చేసి కార్యచరణ రూపొందించాలని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి దుర్వినియోగం చేసిందని అన్నారు. 2019 నుంచి 2024 వరకు మొత్తం విడుదల చేయాలని కోరారు. దళితవాడల అభివృద్ధికి ఈ నిధులు వెచ్చించాలని, ఆర్థిక, విద్య,ఆరోగ్య, వైద్య, సామాజిక అభివృద్ధికి చెందుటకు ఉపయోగపడేలా చేయాలని కోరారు.

## రెవెన్యూ రికార్డులకు భద్రత కరువు

**ప్రజాశక్తి-చిట్వేలి**

కిటికీకి ఏర్పాటు చేసిన గోనెసంచి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇటీవల మండలంలోని భూములకు సంబంధించిన రికార్డులు ఉన్న గది నుంచి రెవెన్యూకి సంబంధించిన అన్ని రికార్డులను మరొక గదిలో ఉంచి భద్రపరిచారు. ఆ గదికి కిటీకీ లేకపోవంతో గొనెసంచి కట్టారు. వారం రోజులుగా భద్రత లేని గదిలో మండల రెవిన్యూ రికార్డును ఉంచడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు సమయపాలన లేకుండా రావడం, ఎవరైనా అధికారి కోసం వస్తే సార్ మీటింగ్ ఉందని వెళ్లారు అంటూ పొంతనలేని జవాబు ఇవ్వడం రెవెన్యూ శాఖకు పరిపాటిగా అంటున్నారు. ఎంతో విలువైన ఈ రెవెన్యూ రికార్డు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకొని పటిష్టమైన రూమ్‌లో రికార్డులను భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

## నేను బడికిపోతా కార్యక్రమం వేగవంతం

**ప్రజాశక్తి-పెద్దమండ్యం**

రాష్ట్ర విద్యాశాఖ చేపట్టినటువంటి 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా పెద్దమం డ్యం మండల కేంద్రంలో బడి బయట ఉన్నటువంటి పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని వేగవంతం నిర్వహి స్తున్నారు. శనివారం మండల విద్యాశాఖ అధికారులు మనోహర్, రామకృష్ణలు,మల్లిక అనే బాలిక బడి మానేసి ఇంటి వద్ద తల్లిదండ్రుల వెంబడి ఉన్నట్లు గుర్తించి, తల్లిదండ్రులను పిలిపించి ఆ బాలికను కెజిబివి సిద్ధవరంలో ఆరవ తరగతిలో చేర్పించినట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు చదువును కొనసాగించుటకు అంగీకరించారని అన్నారు. కార్యక్రమంలో కెజిబివి స్పెషల్ ఆఫీసర్ రాణి, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికను బడిలో చేర్పిస్తున్న ఎంఇఒలు

# క్రైం కార్నర్

## బిటెక్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

**ప్రజాశక్తి-గాలివీడు**

కుర్రపోతుల మణికుమార్(ఫైల్ ఫొటో)

స్థానిక పంచాయతీ మూలవడ్డేపల్లి చెందిన కుర్రపోతుల ఈశ్వరయ్య కుమారుడు కుర్రపోతుల మణికుమార్(17) అనే బిటెక్ విద్యార్థి ఈనెల18 నుంచి కనిపించడం లేదని అతని తండ్రి ఈశ్వరయ్య, తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎస్‌వి సెట్ కాలేజీలో బిటెక్ మొదటి సంవత్సరం చదువతున్నాడని తెలిపారు. 18న నుంచి తమ కొడుకు కనిపించడం లేదని ప్రిన్సిపల్, తోటి విద్యార్థులు తెలి పారని అన్నారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు విద్యార్థి ఆచూకీ కొరకు గాలింపు చర్యలు చేపడతామని ఎస్ఐ పేర్కొన్నారు.

## దిగువగొట్టివీడులో ఘర్షణ : ఒకరికి గాయాలు

**ప్రజాశక్తి-చిన్నమండెం**

మండల పరిధిలోని దిగువ గొట్టివీడులో పుల్లగూర శ్రీరాములు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన గురజాల పాపారావు అనే వ్యక్తి ఎయిర్ గన్‌తోదాడి చేయడంతో శ్రీరాములు తలకు గాయాలయ్యాయని, ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పాపారావుకు శ్రీరాములు కు మధ్య భూ తగాదాలు ఉండేవని అన్నారు.శుక్రవారం పాపారావు శ్రీరామును గ్రామంలోని జెండామాను దగ్గరకు రమ్మని పిలవడంతో ఎందుకని ప్రశ్నించడంతో పాపారావు శ్రీరాములు తలపై ఎయిర్ గన్‌తో దాడి చేశారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు.

# అసౌకర్యంగా ఆర్‌టిసి బస్టాండ్

- వెలగని విద్యుత్ బల్బులు, తిరగని ఫ్యాన్లు
- మరమ్మతులకు నోచని మరుగుదొడ్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టని సంబంధిత అధికారులు

చిత్తడిగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్

**ప్రజాశక్తి-గాలివీడు**

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో అసౌకర్యాలతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురవ ుతున్నారు. బస్టాండ్‌లో వెలగని విద్యుత్ బల్బులు, తిరగని ఫ్యాన్లు, పలకని టివి దర్శన మిస్తు న్నాయి. బస్టాండ్‌లో దుర్భర పరిస్థితి కొనసాగుతోంది. మరుగుదొడ్లకు మరమ్మతులు చేయక పోవంతో మహిళలు, మహిళా కండక్టర్లు ఇబ్బందులు గురవుతున్నారు. వర్షం వస్తే బస్టాండ్ ఆవరణం అంతా చిత్తడి చిత్తడిగా మారిపోతుందని అన్నారు. బస్టాండ్ ఆవరణంలోనే ఆటోలు, బైక్‌ల ను పార్కింగ్ చేయడంతో బస్సు రాకపోకలు సాగించాలనే ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదు. మండల కేంద్రంగా ఉన్న గాలివీడులో కంట్రోలర్ లేకపోవడం శోచనీయమని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది ఆర్‌టిసి బస్టాండ్ పరిధిలో ఉన్న అద్దె భవనాలకు లక్షకు పైబడి ఆదాయం సమకూరుతోందని అన్నారు. మండల కేం ద్రమైన గాలివీడు ఆర్‌టిసి బస్టాండ్‌పై అధికారులు చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇక్కడి నుంచి కడప, నెల్లూరు, అనంతపురం, పుట్టపర్తి జిల్లాలకు ఆర్‌టిసి సర్వీసులు నడు స్తాయని అన్నారు. అనేక జిల్లాల నుంచి పర్యాటకులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలి పారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధి కారులు దృష్టి పెట్టి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని, బస్టాండ్ ఆవ రణంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆర్‌టిసి బస్టాండ్ అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధి హామీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న పీడీ మద్దిలేటి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ఉద్యోగులు క్రమశిక్షణతో పని చేయాలని డ్వామా పీడీ ఎంసి.మద్దిలేటి తెలిపారు. శనివారం వెలుగు పీడీ బి.సత్యనారాయణ, వెలుగు డిపిఎం ధర్మరాజు, ఉపాధి ఎవిఒ ప్రకాష్, ఆడిట్ ఎస్‌టిఎం లోకేశ్వర్‌రెడ్డిలతో కలిసి స్థానిక ఉపాధి హామీ భవనం ఆవరణంలో 2023-24 సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా వివిధ శాఖలలో 1505 పనులకు రూ.3,20,29,779కోట్ల లను ఖర్చు చేసిన దానిపై 18వ సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 2023-24లో ఎన్‌ఆర్ ఇజిఎస్ ద్వారా చేసిన ఉపాధి హామీ పనులను, ఇతర శాఖలో చేసిన పనులను సామాజిక తనిఖీ బృందం ప్రతి పంచాయతీలోనూ ప్రతి పనిని క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన పనులను పరిశీలించి వాటిలోని లోపాలను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, ఉపాధి హామీ సిబ్బంది, రైతులతో కలసి సామాజిక తనిఖీ బృందం ప్రతి పంచాయతీలోనూ గ్రామ సభను ఏర్పాటు చేసి పరిశీలించిన పనుల స్థితిగతులను ప్రజలతో చర్చించామన్నారు. శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదికను ఏర్పాటు చేసి బహిరంగంగా ప్రజలకు వివరించామని అన్నారు. ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందిలో, టెక్నికల్ అసిస్టెంట్‌ల నిర్లక్ష్యం కారణంగా కొన్ని లోపాలను గుర్తించినట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేసినపనుల కొల తలకు, తనిఖీ బృందం గుర్తించిన పనుల కొలతలకు తేడాలను గుర్తించామన్నారు. పనుల గుర్తింపు, పనుల ప్రారంభం, పనిపూర్తి, వేతనాలు చెల్లింపులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేవని అన్నారు. పిఒ సంతకాలు లేకుండా, ఖాళీ ఎం.బుక్కులను ఉపయోగించి బిల్లులు చెల్లించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.5వేలు పెనాల్టీగా వేసినట్లు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్, ఇతర సిబ్బంది క్రమశిక్షణ రహితంగా ఉన్నారని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి చేపట్టిన ఇంకుడు గుంతల పనులలో అవకతవకలు జరిగాయని, హౌసింగ్ అధికారులు సక్రమమైన సమాచారం ఉపాధి హామీ సిబ్బందికి తెలియజేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ సిబ్బందికి వారి విధులపై కనీసం అవగాహన లేకపోవడంతో ఆగ్రహించి సిబ్బంది పనితీరు మార్చుకోవాలని లేనిపక్షంలో తాము తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి పనితీరు మెరుగుపరుచుకునేలా చర్యలు తీసుకోవాలని ఎపిఒ రమేష్‌కు సూచించారు. వెలుగు పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై ఉపాధి హామీ సిబ్బంది తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇందులో తవళం పంచాయితీలో 9 మంది, రెడ్డివారిపల్లె పంచాయితీలో ఒకరు వికలాంగుల పెన్షన్‌లపై ఆరోగ్య పింఛన్ల నగదును తీసుకుంటున్నట్లు గుర్తించామని, వీటిని సమీక్షించాలని, అనర్హులైన వాటిని రద్దు చేసి నివేదిక ఇవ్వాలని ఎంపిడిఒను ఆదేశించారు. బండ్లపై, నిమ్మనపల్లి, ముష్టూరు పంచాయితీలో గత రెండు నెలల్లో ఏడుగురు చనిపోయినా పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలో వారి పింఛను నగదు జమ అయిందని, ప్రభుత్వం దానిని తిరిగి తీసుకుంటుందని తెలిపారు.కార్యక్రమంలో ఎపిడి నందకుమార్, ఎపిఒ రమేష్, ఎస్‌ఆర్‌పి సుబ్బారావు, డిఆర్‌పిలు శివకుమార్, పీఎం రాజేష్, మల్లికార్జున, హరేంద్రన్, జెఇఒ కొండప్ప, టిఎలు పద్మావతి, దివ్యభారతి, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంఇఒలు

ప్రతి ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరని ఉపాధ్యాయులు ఆర్.వెంకటరమణ అన్నారు. శనివారం మండల విద్యాశాఖ అధికారులు పద్మావతి, నారాయణల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు కలసి ఆయనకు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రమైన నిమ్మనపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎంగా, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఆర్.వెంకటరమణ గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు పునాదులు వేస్తూ సేవలందించాలని అన్నారు. శనివారం తన చివరి పని దినం కావ డంతో విధులకు హాజరయ్యారు. స్థానిక ఉపాధ్యా యు లు, ఎంఆర్‌సి సిబ్బంది , ఎఇఒలతో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఉద్యోగికి తన జీవితంలో పదవి విరమణ తప్పదని, ఉద్యోగి తన బాధ్యతను సక్రమంగా నిర్వహించి, ప్రజాసేవలో ఉన్నత స్థాయిలో నిలవా లన్నారు. పదవి విరమణ పొందడం బాధగా ఉన్న, తప్పనిసరిగా విరమణ చేయాలన్నారు. పదవి విరమణ అనంతర జీవితం సంతోషంగా గడపాలని ఆయనకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు, బాబురెడ్డి, రామచంద్ర, సిఆర్‌పిలు సుధాకర, పద్మనాభం, మంజుల, సౌజన్య, పద్మ, నరసింహులు పాల్గొన్నారు.

### విఆర్ఒ సేవలు మరువలేనివి

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి** : మండలంలోని గుండ్లపల్లి విఆర్ఒ పూజారి వెంకటరమణ, రెవెన్యూ కార్యాలయం ఆఫీస్ సబార్డినేట్ రామకృష్ణల సేవలు మరపురానివని తహశీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. ఉద్యోగ విరమణ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో పూజారి వెంకటరమణ, రామకృష్ణ దంపతులను శాలవాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. విధినిర్వహణలో వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఆనంద్ కుమార్, డిటి మౌలాలి, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు,పాల్గొన్నారు.

పింఛన్ డబ్బు కోసం బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న సచివాలయం సిబ్బంది

## ప్రభుత్వాలు మారినా తప్పని అవస్థలు

**ప్రజాశక్తి-కలకడ**

ప్రభుత్వాలు మారిన పింఛన్ బట్వాడా చేసే అధికారులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రమైన కలకడ యూనియన్ బ్యాంకులో ప్రతి నెలా వృద్ధులు, విభిన్న ప్రతిభావం తులు, వితంతువులకు పింఛన్ పంపిణీ చేయడానికి బ్యాంకుల వద్ద సచివాలయం సిబ్బంది పడిగాపులు కాయాల్సి వస్తోంది. గత నెలలో పింఛన్ దారులకు వారి అకౌంట్లో పింఛన్ నగదును జమ చేయడంతో తీసుకునేందుకు చాలా మంది వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పింఛన్ పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసింది. బ్యాంకు సిబ్బంది మొదటి తేదీకి ముందు రోజున పింఛన్ డబ్బును సచివాలయం సిబ్బందికి ఇవ్వవలసి ఉంది. పింఛన్ డబ్బు కోసం సచివాలయ సిబ్బంది బ్యాంకుల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. ఆదివారం బ్యాంకులు సెలవు ఉండడంతో సచివాలయం సిబ్బందికి ఒక్కరోజు ముందే నగదును డ్రా చేసుకున్నారు. పింఛన్ సొమ్మును పింఛన్ దారులకు పంపిణీ చేసే వరకు నగదు తమ ఆదీనంలో ఉండటంతో సచివాలయ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. సెక్యూరిటీ ఇబ్బంది వల్ల వాహనం ఆలస్యం కావడం వల్ల సచివాలయం సిబ్బందికి ఇవ్వవలసిన సొమ్మును ఆలస్యంగా ఇవ్వాల్సి వచ్చిందని యూనియన్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు.

## లా సెట్‌లో ఉత్తమ ప్రతిభ

**ప్రజాశక్తి-చిట్వేలి**



శివకృష్ణనాగార్జున

2024 లా సెట్ ఎంట్రన్స్‌లో మండలంలోని చిట్వేలి సింగనమాల వీధికి చెందిన పెద్దంగారి సుబ్బరాయలు కుమారుడు పెద్దంగారి శివకృష్ణనాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన లా సెట్ ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాల్లో 924వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా శివ కృష్ణ తలిదండ్రులు మాట్లాడుతూ లాసెట్ ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు.

## లోక్ అదాలత్‌లో 19 కేసులు పరిష్కారం

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జడ్జి

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు స్థానిక ఇన్‌ఛార్జి జడ్జి అధ్యక్షతన లోకదాలత్ కార్యక్రమం నిర్వహించారు. క్రిమినల్ కేసులు14, సివిల్ 5, కేసులను ఇరు వర్గాల కక్షిదారుల సమ్మతి మేరకు పరిష్కరించారు. కేసులకు సంబంధించి రూ.24,64,576లు రికవరీ చేశారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రెడ్డి, లోక్ అదాలత్ సిబ్బంది గురుప్రసాద్, న్యాయవాదులు, పోలీ సులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడికి మంత్రి 'మండిపల్లి' పరామర్శ

**ప్రజాశక్తి-రామాపురం**

మండలంలోని చిట్లూరు పంచాయతీ ముసలరెడ్డిగారిపల్లికు చెందిన టిడిపి నాయ కుడు గాలివిటీ సురేంద్రకుమార్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద వశాత్తు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆయన ను పరామర్శించి ధైర్యం చెప్పారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు .పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ నమ్ముకున్న వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. త్వరగా కోలుకొని పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రాజశ్రీ రాయచోటి 5వ అనదపు జిల్లా జడ్జి వారి దివ్య సమూహామునకు**

**I.A.No. 485/2024**
**O.S.No. 31/2011**

సయ్యద్ ఫరీదా, W/o సయ్యద్ షరీఫ్, R/a, D.No.64/85-7, బండ్లపెంట, రాయచోటి టవున్, మరియు మండలం, అనమయ్య జిల్లా. ...పిటిషనర్/వాది

Vs

1. సయ్యద్ ఖాసీంపీరా, S/o ఖాజామియ, వయస్సు 56 సంలు, ముస్లిం, R/a, D.No.5/17, సాయిబాబనగర్, చెన్నముక్కపల్లె గ్రామము, రాయచోటి మండలం, అన్నమయ్య జిల్లా.
2. షేక్ దర్బర్, S/o లేట్ బాషా, వయస్సు 45సంలురాలు, ముస్లిం, R/a, D.No.5/43, కరీమియ మాస్వా దగ్గర, చెన్నముక్కపల్లె గ్రామము, రాయచోటి మండలం, అన్నమయ్య జిల్లా.
2. షేక్ ఖాదర్‌బాషా, S/o లేట్ బాషా, వయస్సు 35సంలురాలు, ముస్లిం, R/a, D.No.7/24-A, Upstair, రాజంపేట రోడ్, రాయచోటి టౌన్, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గల దావాలోని పిటిషనర్ (వాది) మీకు వ్యతిరేకముగా ప్రపోజల్ పార్టీగా మిమ్మల్ని ప్రతివాదులుగా చేర్చడానికి పిటిషన్ వేసియున్నాడు. కనుక ప్రతివాదులు అయిన మీరు హాజరు అవడానికి గాను వాయిదా 04.07.2024వ తేదీన ఉన్నది. ఆ దినం ఉదయం 10.30 గంలకు వకీలు ద్వారా గాని, ఖుద్దున గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనంతట మీకు వ్యతిరేకముగా కోర్టు వారు తీర్మాణించబడును.

**//By Order of the Court//**

**యు.రామాంజనేయులు**
పిటిషనరు (వాది) తరపున వకీలు,
రాయచోటి.

అగ్నిప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

## వెన్నెల రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

మదనపల్లె బైపాస్ రోడ్డులో ఉన్న వెన్నెల రెస్టారెంట్‌లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. రెస్టారెంట్‌లోని ఓ అతిథి గృహంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో అందులో ఉన్న మంచానికి మంటలు వ్యాపించి అంటుకుంది. వెంటన్ గమనించిన హోటల్ సిబ్బంది అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి శివప్ప సిబ్బంది తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో చెక్క మంచంతో పాటు టీవీ పూర్తిగా కాలిపోయిందని, సుమారు రూ. లక్ష వరకు ఆస్థి నష్టం సంభవించినట్లు శివప్ప తెలిపారు. అగ్నిమాపక అధికారులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పి రూ. 5 లక్షలకు పైగా ఆస్థిని కాపాడారని హోటల్ యజమాని చలపతి చెప్పారు. అగ్నిమాపక అధికారి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అక్కడున్న ప్రజలకు సిబ్బందికి, కస్టమర్లకు అగ్ని ప్రమాదాల నివారణ గురించి అధికారి శివప్ప అవగాహన కల్పించారు.

## ముత్తూట్ మనీ భవన్ ప్రారంభం

**ప్రజాశక్తి-చిన్నమండెం**

మండల కేంద్రమైన చిన్నమండెంలో రాయచోటి-మదనపల్లి ప్రధాన రహదారి పైన శనివారం ఉదయం ముత్తూట్ మనీ అనే కార్యాలయాన్ని ముత్తూట్ రీజినల్ మేనేజర్ దేవరాజ్ స్థానిక ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కార్యాలయంలో బంగారం పైన రుణాలు, వెహికల్స్ పైన రుణాలు, ప్రజలకు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

## అవినీతికి పాల్పడుతున్న రేషన్ డీలర్లు : ఎంఆర్‌పిఎస్

**ప్రజాశక్తి-వీరబల్లి**

మాట్లాడుతున్న నరసింహులు

మండలంలోని రేషన్ షాపులు బియ్యం పంపిణీ అస్త వ్యస్తంగా మారిందని ఎంఆర్‌పిఎస్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేద్దివీటి నరసింహులు తెలిపారు. మూడు నెలలుగా ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పేద ప్రజలు ఆకలి తీర్చడం కోసం ప్రభుత్వం నిత్యవసర సరుకులు ఇస్తున్నారని అన్నారు. కార్డుదారులకు సక్రమంగా ఇవ్వకుండా యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారని ఆరోపించారు. కరోనా వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు అన్ని రేషన్ దుకాణాలలో నిల్వ చూపించ లేదన్నారు. అధికారులు రేషన్ దుకాణాలను తనిఖీ చేసి పరిశీలించి అవినీతికి పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేద ప్రజలకు నిత్యవసర సరుకులు పక్కదారి పడకుండా చూడాలన్నారు

## సికిల్ సెల్ నిర్మూలనపై అవగాహన

**ప్రజాశక్తి-కలకడ**

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు యంవి.కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియావ్యాధి పై అవగాహన కల్పించేందుకు సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సికిల్‌సెల్ అత్యంత ప్రమాదకరమైనదని రక్తహీనత లోపంతో వస్తుందని, పురుషుల కన్నా స్త్రీలలో ఎక్కువ శాతం ఉంటుందని అన్నారు. ఎక్కువ ఆయాసం ఉంటుందని, తరచుగా జ్వరం వస్తుందని, రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని, ప్రతి ఒక్కరూ హిమగ్లోబిన్ టెస్ట్ చేసుకోవాలని సూచించారు. ఉండవలసిన దానికన్నా ఎంఎస్ శాతం తక్కువ ఉండటం, జీవిత కాలమంతా ఎర్ర రక్త కణాలు తగ్గిపోయి ఉండటం వంటి లక్షణాన్ని ఉంటాయని అన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు మంచి ఆహారం పోషకాహారాలు తీసుకోవాలని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి జవహర్ బాబు, ఎంపి హెచ్ఇఒ జయరామయ్య, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్నమ్మ ,హెల్త్ సూపర్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, స్టాఫ్ నర్స్ జె.భారతమ్మ, ఫార్మసిస్ట్ షరీఫ్‌బాషా, ల్యాబ్ టెక్నీషియన్ జమీల్ అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు ఎన్.వాణి, డి.వరలక్ష్మి, ఎఫ్ఎన్ఒ అలివేలు, మంగబాయ్, అటెండర్ సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సికిల్ సెల్‌పై అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

**ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024**

# ఎంట్రీలకు ఆహ్వానం

*ప్రియమైన మిత్రులారా!*

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

**ఎంట్రీలు పంపాల్సిన చిరునామా**

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ